క్లుప్తంగా

భవానీమాత ఆలయంలో సహపంక్తి భోజనాలు



అన్నదానం ప్రారంభిస్తున్న జీఎం కృష్ణయ్య

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియాలోని సీహెచ్‌పీ శ్రీ భవానీమాత ఆలయంలో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. శనివారం ఏరియా జీఎం వీసం కృష్ణయ్య ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి సహపంక్తి భోజనాలు ప్రారంభించారు. సీహెచ్‌పీ మేనేజర్ దామోదర్, ఎస్‌ఓటూ జీఎం రామస్వామి, ఏజీఎం ఐఈడీ గిరిధర్‌రావు, డీజీఎం పర్సనల్ తుకారం, శివవీరకుమార్ పాల్గొన్నారు.

కేసు నమోదు

పాల్వంచరూరల్: భూ వివాదం కారణంగా బాబాయిని అన్నకుమారుడు కర్రతో దాడి చేసిన సంఘటన నాగారం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు... మండల పరిధి నాగారం గ్రామానికి చెందిన తాండ్ర సుబ్బారావు, అతని సోదరునితో కొంతకాలంగా భూవివాదం ఉంది. సోదరుడి కుమారుడైన తాండ్ర ప్రసాద్ శనివారం సుబ్బారావుతో గొడవ పడి కర్రతో దాడి చేశాడని బాధితుడి ఫిర్యాదు మేరకు దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేశ్ తెలిపారు.

వేధింపులకు గురిచేస్తున్న భర్తపై..

పాల్వంచరూరల్: అనుమానంతో వేధిస్తున్నాడని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు భర్తపై కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల పరిధి కొత్తసూరారం గ్రామానికి చెందిన గుగులోతు కుమారి చంద్రుగొండ మండలం కరిసలబోడు గ్రామానికి చెందిన మేనత్త కుమారుడైన గుగులోతు సంతును 2011లో వివాహం చేసుకుంది. ఏఎన్ఎంగా పనిచేస్తున్న కుమారిపై భర్త వేధింపులకు గురిచేస్తుంటే పలుమార్లు పెద్దమనుషుల్లో పంచాయతీ నిర్వహించారు. అయినా అతనిలో మార్పు రావడం లేదని శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సంతుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐతెలిపారు.

తలకొరివి పెట్టిన మనమరాలు



నాయనమ్మకు అంత్యక్రియలు చేస్తున్న మనమరాలు

టేకులపల్లి: టేకులపల్లి మండలం బోడు గ్రామంలో శనివారం నాయనమ్మకు మనమరాలు తలకొరివి పెట్టింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. అడపా వీరమ్మ (68) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె భర్త మంగయ్య కొన్నేళ్ల క్రితమే మృతి చెందారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు చంద్రశేఖర్ నాలుగేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎనిమిదేళ్ల మనుమరాలు అడపా ప్రియ చేత అంత్యక్రియలు చేయించారు.

బురద రోడ్డులో రైతుల అవస్థలు



పొలాలకు వెళ్లే రహదారి దుస్థితి

టేకులపల్లి: తడికలపూడి పంచాయతీ కోక్యా తండా రైల్వే గేటు నుంచి గుట్టకు, పొలాలు, ఈట్యా తండాకు వెళ్లే 5 కిలోమీటర్ల రహదారి అత్యంత ప్రమాదకరంగా మారింది. వ్యవసాయ పనుల నేపథ్యంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే ఇక అంతే సంగతులు. పక్కా రోడ్డు కోసం స్థానిక రైతులు, ప్రజలు ఐదు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి ఈ మార్గంలో పక్కా రోడ్డు నిర్మించాలని గ్రామానికి చెందిన షీల్డ్ టీమ్ ప్రధాన కార్యదర్శి అజ్మీర లక్ష్మణ్, కళ్యాణ్, నరేశ్, రాజ్‌కుమార్, రైతులు కోరుతున్నారు.

ఎన్ఎండీసీ పునరుద్ధరణకు వినతి

పాల్వంచ: పాల్వంచలోని ఎన్ఎండీసీ కర్మాగారాన్ని పునరుద్ధరించేలా చర్యలు తీసకోవాలని ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు ఎంపీ రేణుకాచౌదరికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఐఎన్‌టీయూసీ ఉమ్మడి రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి ఎస్‌కే అబ్దుల్ జలీల్, పట్టణ అధ్యక్షుడు బానోతు బాలునాయక్, శనగ రాంచందర్‌రావు, కిషోర్ నాయక్, భూషణం, రవి పాల్గొన్నారు.







కొత్తగూడెంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన ప్రమిదలు, బొమ్మలు, పూల దుకాణాలు

విపణికి దీపావళి శోభ..

- వివిధ రూపాల్లో ప్రమిదల అమ్మకం
- సందడిగా మారిన ప్రధాన వీధులు

సండే స్పెషల్



బొమ్మలు, ప్రమిదలు కొనుగోలు చేస్తున్న స్థానికులు

కొత్తగూడెంటౌన్/పాల్వంచరూరల్: చీకటి లేదా చెడుపై శక్తి విజయం సాధించడానికి సూచికగా దీపావళి పండుగ జరుపుకుంటారు. ఇదేరోజు నరకాసురుడిని యుద్ధంలో శ్రీకృష్ణుడు సంహకరించాడని నమ్ముతారు. ఈ నేపథ్యాన 20వ తేదీ సోమవారం దీపావళి పండుగ జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. ఈ పండుగకు ప్రధానంగా దీపాల వెలుగులే గుర్తుకొస్తాయి. ఇళ్ల ముందు పోటాపోటీగా దీపాలు వెలిగించేందుకు ప్రజలు పోటీ పడతారు. ఇళ్లు, వ్యాపార సంస్థల్లో ప్రత్యేక పూజలు చేయడమే కాక లక్ష్మీదేవిని పూజించి దీపారాధన చేస్తారు. ఈ మేరకు కొత్తగూడెంలోని సూపర్‌బజార్, చిన్న బజార్, పెద్ద బజార్, రామవరం, రుద్రంపూర్, గౌతంపూర్ తదితర ప్రాంతాల్లో దీపాంతలే కాక బొమ్మల కొలువునకు అవసరమైన బొమ్మల అమ్మకం జోరుగా సాగుతోంది. అమ్మకం, కొనుగోలుదారులతో ప్రధాన వీధులు సందడిగా మారాయి.

ఆకట్టుకునేలా ప్రమిదలు..

తొలినాళ్లలో కేవలం మట్టితో ఒకే రూపులో తయారు చేసే ప్రమిదలు మాత్రమే అమ్మేవారు. కానీ మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త డిజైన్లలో రూపొందిస్తున్నారు. స్థానికులే కాక ఇతర జిల్లాలు, రాష్ట్రాల వ్యాపారులు వివిధ ఆకృతుల్లో ఆకట్టుకునేలా తయారు చేసిన ప్రమిదలు అమ్ముతున్నారు. ప్రమిదలు సైజు, డిజైన్ ఆధారంగా డజన్‌కు రూ.80 రూ.140 కు విక్రయిస్తున్నారు. ఇక బొమ్మల కొలువుకు అవసరమైన దేవుళ్లు, ఇతర బొమ్మలు రూ.30 మొదలు రూ.600 అందుబాటులో ఉన్నాయి.

దీపాలు వెలిగించడం సంప్రదాయం..



ఏటా దీపావళి రోజున ప్రమిదల్లో దీపాలను వెలిగించడం అనువాయితీగా వస్తోంది. గతంలో చిన్నచిన్న ప్రమిదల్లో వెలిగించేవాళ్లం. కానీ మారుతున్న కాలంతోపాటు ప్రమిదలు ఆకట్టుకునే విధంగా వివిధ ఆకృతుల్లో తయారుచేసి విక్రయిస్తున్నారు. వాటిని చూడగానే బావున్నాయని కొనుగోలు చేసి తెచ్చిన.

– శ్రీదేవి, పాల్వంచ

దీపంతలు, బొమ్మలకు గిరాకీ..



ప్రమిదలు, దేవుళ్ల బొమ్మలు కొనుగోలుకు చాలా మంది వస్తున్నారు. ఈసారి గిరాకీ బాగానే ఉంది. ఎక్కువగా కళాత్మకంగా తయారు చేసిన ప్రమిదలు, బొమ్మలు కొనుగోలు చేస్తున్నారు. సైజ్‌లు, డిజైన్ల ఆధారంగా ఈసారి ధర ఉంది. ఏటా ఇక్కడే సామగ్రి అమ్ముతుంటాం.

– శ్రీలక్ష్మి, చిరువ్యాపారి, కొత్తగూడెం

స్వీయ రక్షణతోనే ప్రమాదాలకు దూరం

కొత్తగూడెంటౌన్: పిల్లల నుంచి పెద్దల వరకు బాణసంచా కాల్చడమే ఇష్టం. అయితే, అప్రమత్తంగా ఉంటూ కొన్ని జాగ్రత్తలు పాటిస్తే దీపావళిని సంతోషంగా జరుపుకోవచ్చు. లేనిపక్షంలో ప్రమాదాల బారిన పడే ప్రమాదముంది. ఏమరుపాటుగా ఉంటే గాయాలు పాలు కావడమే కాక ఆస్తి, ప్రాణనష్టం జరిగే అవకాశముంది. ఈ మేరకు టపాసులను పిల్లల చేతికి ఇవ్వొద్దని, పెద్దల పర్యవేక్షణలోనే బాణసంచా కాల్చేలా చూడాలని సూచిస్తున్నారు. అంతేకాక ఆరు బయటే కాలుస్తూ కాటన్ దుస్తులు ధరించాలని, పెద్ద శబ్దాలతో చెవులకు హానీ కలగకుండా చెవుల్లో దూది పెట్టుకోవాలని, పేలుడు పదార్థాలకు దూరంగా బాణసంచా కాల్చాలని పెద్దలు చెబుతున్నారు.

జాగ్రత్తలు పాటించాలి..



బాణసంచా పిల్లలకు ఇవ్వకపోవడమేకాక గ్యాస్, తదితర పేలుడు పదార్థాలకు దూరంగా నిల్వ చేయాలి. ఎక్కువ శబ్దం వచ్చే టపాసుల జోలికి వెళ్లొద్దు. పిల్లల చెవుల్లో దూది పెట్టడం ద్వారా కొన్ని సమస్యలు దరిచేరవు.

– డాక్టర్ జి.వరుణ్, అసిస్టెంట్ సివిల్ సర్జన్, కొత్తగూడెం

అప్రమత్తత తప్పనిసరి..



దీపావళి వేళ అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి. ప్రమాదం ఎదురైతే మంటలు ఆర్పేలా నీళ్లు అందుబాటులో పెట్టుకోవాలి. అనుకోని ప్రమాదాలు జరిగితే అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వాలి.

– ఎం.క్రాంతికుమార్, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి

6 నుంచి డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంప్‌లు



జీఎం(పర్సనల్) వెల్ఫేర్ కిరణ్‌కుమార్

కొత్తగూడెంఅర్బన్: నవంబర్ 6 నుంచి సింగరేణి సీఎంపీఎఫ్ పెన్షనర్ల కొరకు డిజిటల్ సర్టిఫికెట్స్ క్యాంపులు నిర్వహించనున్నామని జీఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సీఎస్ఆర్ జీవీ కిరణ్‌కుమార్ తెలిపారు. శనివారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ క్యాంపెయిన్ 4.0లో భాగంగా దేశవ్యాప్తంగా అన్ని సంస్థల పెన్షనర్స్‌లో 'డిజిటల్ సాధికారత'పెంచాలనే ఉద్దేశంతో పెన్షనర్లు వారి మొబైల్ నుంచే డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించేందుకు అవగాహన కల్పించేందుకు క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలో నవంబర్ 6, ఇల్లెందు ఏరియాలో 11న, కొత్తగూడెం ఏరియాలో 14న, మణుగూరు ఏరియాలో 19వ తేదీలలో క్యాంప్‌లు ఉంటాయని పేర్కొన్నారు. సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ వంశీధర్ కుసుంభ ఉన్నారు.

అక్రమ కేసులను నిలిపివేయాలి



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డిపై అక్రమ కేసులు పెట్టి, నిర్బంధ విచారణ చేపట్టి ఇబ్బందులు పెట్టడం ఏపీ ప్రభుత్వానికి తగదని అంబేద్కర్ సంక్షేమ సంఘం ముఖ్య సలహాదారుడు గొల్లపల్లి దయానందరావు, గాంధీపథం జిల్లా కన్వీనర్ చింతలచెర్వు గోర్డెమ అన్నారు. శనివారం పోస్టాఫీసు సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రకారం పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఏపీ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను పత్రికతో ప్రజలందరికీ తెలియజేస్తే, దానిని తప్పుగా భావించి అక్రమ కేసులు పెట్టడం, పదే పదే విచారణ చేయడం గర్హనీయమన్నారు. ఏపీ ప్రభుత్వం తీరును ప్రజలందరూ గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్తారని జోష్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో 1969 ఉద్యమకారుల సంఘం నాయకులు శ్రావణబోయిన నర్సయ్య, నాయకులు వరప్రసాద్, రాజేశ్వరరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ కాకర్స్ కాల్చుదాం..



కొత్తగూడెంటౌన్: దీపావళి పండుగకు టపాసులు కాల్చడాన్ని అంతా ఆనందంగా భావిస్తారు. ఈ క్రమాన గ్రీన్ క్రాకర్స్ కాల్చాలని.. తద్వారా పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పలువురు కోరుతున్నారు. బాణసంచా తయారీలో ఉపయోగించే పదార్థాలతో శబ్ద, వాయు కాలుష్యం ఏర్పడుతుందని.. అంతేకాక ఆరోగ్యానికి ముప్పు ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. గ్రీన్ క్రాకర్స్ లో తక్కువ కాలుష్యం ఉత్పత్తి చేసే పదార్థాల వినియోగంతో తక్కువ శబ్దం వస్తుందని.. వాయు కాలుష్యం కూడా పెద్దగా ఉండదని చెబుతున్నారు.

శబ్ద కాలుష్యంతో అనారోగ్యం..



విషవాయువులను పీలిస్తే ఊపిరితిత్తులపై ప్రభావం పడుతుంది. చర్మ, గుండె సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. అందుకే కాలుష్య రహిత బాణసంచా కాల్చడంపై దృష్టి సారించాలి. గ్రీన్ క్రాకర్స్‌తో సంతోషంగా దీపావళి జరుపుకోవాలి.

– డాక్టర్ బాబురావు, లంగ్స్ అండ్ క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్, కొత్తగూడెం

దీపావళికి గ్రీన్ క్రాకర్సే వాడాలి..



పర్యావరణానికి టపాసులు హానీ కలిగిస్తాయి. అంతేకాక చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యం దెబ్బ తింటుంది. దీపావళిని కాలుష్య రహితంగా జరుపుకునేలా గ్రీన్ క్రాకర్స్ వినియోగించాలి. అంతేకాక ప్రతీఒక్కరు దీపావళికి పండుగ సందర్భంగా ఒక మొక్క నాటాలి.

– కొట్టూరి సూర్య రాజశేఖర్, మొక్కల ప్రేమికుడు, రామవరం

బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ కల్పించండి..



జీఎం పర్సనల్ కవితా నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని, సింగరేణి బీసీ, ఓబీసీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నల్లాపూర్ రమేష్ అన్నారు. బీసీ రిజర్వేషన్‌కు రాజ్యాంగ రక్షణ కల్పించాలని డిమాండ్‌తో శనివారం జరుగుతున్న బంద్‌కు మద్దతుగా సింగరేణి ప్రధాన కార్యాలయంలోని జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం) కవితానాయుడుకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ ఈ నిరసన కార్యక్రమాల్లో భాగంగా సింగరేణి వ్యాప్తంగా తమ అసోసియేషన్ నాయకులు ఈరోజు వినతిపత్రాలు అందజేశామని దానిలో భాగంగా హెడ్డాఫీస్‌లో కూడా అందజేస్తున్నామన్నారు. దశాబ్దాలుగా బీసీ వర్గాలకు తగిన రాజకీయ, సామాజిక, విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లు లభించాలనే ధ్యేయంతో రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సంఘాలు నిరంతరం పోరాటాలు చేస్తున్న విషయం తెలిసిందేనన్నారు. ఈ కృషి ఫలితంగా ప్రభుత్వం ఇటీవల బీసి రిజర్వేషన్లు 42శాతం పెంచుతూ జీఓ నంబర్ 9 విడుదల చేసిందని, అయితే దీనిని వ్యతిరేకిస్తూ కొంతమంది నాయకులు కోర్టుల్లో పిటిషన్ వేయటం ద్వారా బీసీ వర్గాల హక్కులను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారి విమర్శించారు. కేవలం 5 శాతం ఉన్న వర్గాలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, సాంఘికంగా, అణగదొక్కాలనే ఆలోచన దురదృష్టకరం, బాధాకరమన్నారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న ఈ రాష్ట్ర బంద్ బీసీ వర్గాల ఆత్మ గౌరవంతో పాటు దామాషా పద్ధతిన రాజ్యాంగ పదవులు సాధించటం, భవిష్యత్‌లో మరింత ముందుకు వెళ్లే అవకాశం రావచ్చన్నారు. చీఫ్‌లైజన్ ఆఫీసర్ వేముల మురళీ, శ్రీనాథ్, ఎడవల్లి యాదగిరి, నాగరాజు, పీతాంబరం, పి.శంకర్, చింతకింద శ్రీనివాస్, వెంకటస్వామి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సుధాకర్, వెంకటరమణ, నిశా, ప్రియాంక, భార్గవి పాల్గొన్నారు.

డైలీవేజ్ వర్కర్ల ఆందోళన



ఆందోళన చేస్తున్న డైలీవేజ్ వర్కర్లు

ఇల్లెందు: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పని చేస్తున్న డైలీవేజ్ వర్కర్ల ఆందోళన 37వ రోజుకు చేరిందని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్‌ఏ నబీ తెలిపారు. శనివారం ఇల్లెందు డైలీవేజ్ వర్కర్ల ఆందోళనకు మద్దతు తెలిపా మాట్లాడారు. ప్రభుత్వం తక్షణమే డైలీవేజ్ వర్కర్ల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, రామకళ, మంగ, లక్ష్మణ్, లక్ష్మీనారాయణ, పద్మ, స్వరూప, అంజమ్మ పాల్గొన్నారు.

ముగిసిన జోనల్ స్థాయి క్రీడా పోటీలు



ఇల్లెందురూరల్: పరుగు పందెం ప్రారంభిస్తున్న ఐటీడీఏ క్రీడాధికారి గోపాలరావు

పాల్వంచరూరల్: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్ల విద్యార్థులకు రెండు రోజులపాటు జరిగిన జోనల్ స్థాయి క్రీడా పోటీలు ముగిశాయి. కిన్నెరసాని గిరిజన క్రీడా పాఠశాల మైదానంలో రెండో రోజు శనివారం బాలికలు మొత్తం 150 మంది పాల్గొనగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, టెన్నీకాయిట్స్, చదరంగం, క్యారమ్స్ క్రీడాంశాలలో అండర్ 14, 17 విభాగాల్లో నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు నవంబర్ రెండోవారంలో జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం ఎస్.చందు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ స్పోర్ట్స్ ఆఫీసర్ వెంకటనారాయణ, పీడీ బాలసుబ్రహ్మణ్యం, పీఈటీలు నగేష్, అంజయ్య, నర్సయ్య, నాగమణి, వెంకటేశ్వర్లు, రవి, రాంబాబు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాలలో ఐటీడీఏ ఇల్లెందు డివిజన్‌లోని ఆశ్రమ పాఠశాలల జోనల్ స్థాయి క్రీడలు రెండో రోజు శనివారం ఉత్సాహంగా సాగాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షాట్‌పుట్, క్యారమ్స్, చెస్ అంశాలలో బాలికలను జట్లుగా ఎంపిక చేసి వారి ప్రతిభను పరీక్షించారు. కార్యక్రమంలో ఐటీడీఏ క్రీడాధికారి గోపాలరావు, హెచ్ఎం నాగమణి, క్రీడా శిక్షకులు పాల్గొన్నారు.

బీసీ సంఘాల బంద్ విజయవంతం



ఇల్లెందు: కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీ...



పాల్వంచరూరల్: కిన్నెరసాని గిరిజన విద్యాలయాలను మూయించిన నాయకులు



ఇల్లెందు: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

బీసీలకు చట్ట సభల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల పిలుపు మేరకు శనివారం బంద్ విజయవంతం అయింది. బంద్‌లో బీసీ సంఘాల జేఏసీ, అధికార, ప్రతిపక్ష పార్టీలు పార్టీలు పాల్గొన్నాయి. బస్సులు, ఆటోలు, ప్రైవేటు వాహనాలు రోడ్డెక్కలేదు. విద్యా సంస్థలు బంద్ పాటించాయి. పెట్రోల్ బంకులు, సినిమా హాళ్లు, హోటళ్లు, అన్ని రకాల దుకాణాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు తెరుచుకోలేదు. నాయకులు రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. పోలీసులు బంద్‌ను పర్యవేక్షించారు.

– సాక్షి నెట్‌వర్క్



సింగరేణి(కొత్తగూడెం): అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు



పాల్వంచరూరల్: అంబేద్కర్ సెంటర్‌లో ప్రదర్శనలో బీజేపీ నాయకులు



జూలూరుపాడులో అఖిలపక్షం ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు



జూలూరుపాడు: రాస్తారోకో నిర్వహిస్తున్న అఖిలపక్షం నాయకులు



సూపర్‌బజార్(కొత్తగూడెం): కాంగ్రెస్ ఆధ్వర్యంలో



పాల్వంచ: బీసీఎం రహదారిపై రాస్తారోకో చేస్తున్న నాయకులు



ఇల్లెందురూరల్: చల్లసముద్రంలో రాస్తారోకో..



కొమరారంలో బీసీ సంఘాల నాయకులు



సూపర్‌బజార్(కొత్తగూడెం): మాట్లాడుతున్న వనమా రాఘవ





టేకులపల్లిలో నిలిచిపోయిన వాహనాలు, ధర్నా చేస్తున్న బీసీ సంఘాలు, అఖిలపక్షం నాయకుల